Digital, tmedia.net.in

# టీ-మీడియా

మెయిన్ ఎడిషన్

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 321
పేజీలు : 3
బుధవారం 24.06.2026

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ


## కేంద్ర మంత్రి జార్జ్ కురియన్ రాజీనామా



**టిమీడియా, జూన్23,న్యూఢిల్లీ:** కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి జార్జ్ కురియన్తన పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజ్యసభ సభ్యత్వం ముగిసిపోవడంతో మంత్రి పదవికి రాజీనామా సమర్పించారు. అయితే మళ్లీ రాజ్యసభ సీటు ఇచ్చేందుకు బీజేపీ పార్టీ సుముఖత వ్యక్తం చేయలేదు. దీంతో ఆయన తన పదవిని వదులుకోవాల్సి వచ్చింది. కురియన్ అందజేసిన రాజీనామాను రాష్ట్రపతి ముర్ము ఆమోదించినట్లు మంగళవారం రాష్ట్రపతి భవన్ పేర్కొన్నది. మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ మంత్రిత్వ శాఖకు కూడా ఆయన మంత్రిగా చేశారు. ప్రధాని మోదీ ఇచ్చిన సూచన మేరకు రాష్ట్రపతి ముర్ము ఆయన రాజీనామాను ఆమోదించారు. కేంద్ర మంత్రి మండలిలో ఉన్న క్రైస్తవ వర్గానికి చెందిన ఏకైక మంత్రి జార్జ్ కురియన్ మాత్రమే. జూన్ 21వ తేదీన ఆయన రాజ్యసభ పదవీకాలం ముగిసింది.

## కేంద్రమంత్రులతో
# చర్చలు ఫలప్రదం

- ఫేజ్-1 , ఫేజ్-2 విస్తరణ కన్సల్టెంట్ నియామకం

**టీ మీడియా, జూన్ 23, ఢిల్లీ బ్యూరో:** హైదరాబాద్ మెట్రో రైలు స్వాధీనం, విస్తరణపై కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రి జరిపిన చర్చలు ఫలప్రదమయ్యాయి. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉదయం ఖట్టర్ నివాసంలో ఈ అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మెట్రో ఫేజ్- × వాల్యుయేషన్, ఫేజ్-× స్వాధీనానికి అవసరమైన రుణ సేకరణ, మెట్రో ఫేజ్-×× విస్తరణకు సంబంధించిన అంశాలను అధ్యయనం చేసేందుకు కన్సల్టెంట్ను నియమించాలని కేంద్రమంత్రులు, సీఎం ఏకాభిప్రాయానికి వచ్చారు. కన్సల్టెంట్గా ఎస్బీఐ క్యాప్స్ను ఎంపిక చేశారు.

### కన్సల్టెంట్ నివేదిక ఆధారంగా భవిష్యత్? కార్యాచరణ

మెట్రో ఫేజ్-× వాల్యుయేషన్, ఫేజ్-×× విస్తరణ, ఇతర అంశాలపై ఎస్బీఐ క్యాప్స్ సమగ్రంగా అధ్యయనం చేయనుంది. ఆ సంస్థ ఇచ్చే నివేదిక ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ చేపట్టనుంది. కన్సల్టెంట్ అధ్యయనం సమయంలో సమన్వయానికి ప్రతినిధులుగా కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక అధికారి, రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శి ఉండాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ అధికారులు ఇద్దరు సమన్వయం చేసుకుంటూ ఈ ప్రక్రియ వేగంగా సాగేందుకు కృషి చేస్తారు.

### మెట్రో ఫేజ్-II విస్తరణపై చర్చ

హైదరాబాద్ మెట్రో ఫేజ్-× స్వాధీనం, ఫేజ్-2 విస్తరణపై ఉన్న ఆటంకాలను తొలగించేందుకు సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులతో వరుసగా రెండు రోజులు సమావేశమయ్యారు. తొలుత సోమవారం సాయంత్రం రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డితో సుదీర్ఘంగా చర్చించారు. ఇవాళ కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, అశ్వనీ వైష్ణవ్లతో కలిసి ఖట్టర్ను కలిసిన సీఎం రేవంత్ రెడ్డి, దాదాపు అరగంట పాటు పలు అంశాలపై చర్చించారు. హైదరాబాద్ నగరంలో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు, మెట్రో రెండో దశ గురించి చర్చించినట్లు తెలుస్తోంది. సోమవారం రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ను సీఎం రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డిలు కలిసిన సమయంలో సానుకూల స్పందన వచ్చింది. అంతేకాదు స్వయంగా రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ ఖట్టర్తో ఫోన్లో మాట్లాడి ఇవాళ కలుస్తారని కూడా తెలియజేశారు.



### రాష్ట్రంలోని కీలక ప్రాజెక్టులపై చర్చ

ఖట్టర్ సమావేశంలో రైల్వే మంత్రి కూడా పాల్గొనడం శుభపరిణామంగా చెప్పొచ్చు. ఢిల్లీలో చోటు చేసుకున్న ఈ పరిణామాలను చూస్తుంటే రెండు రోజులుగా సీఎం రేవంత్ రెడ్డి వివిధ శాఖల కేంద్రమంత్రులను కలవడంతో సానుకూల స్పందన వస్తున్నట్లు తెలుస్తోంది. శనివారం ముంబయి వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి, అక్కడి నుంచి ఆదివారం ఢిల్లీ వెళ్లారు. నిన్న, ఇవాళ సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో మకాం వేసి కేంద్రమంత్రులతో వరుసగా సమావేశమవుతూ రాష్ట్ర అభివృద్ధి ప్రాజెక్టులకు కేంద్ర సహకారం కోరుతున్నారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిని కలిసిన సీఎం ప్రధానంగా మెట్రో విస్తరణ, ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్? (ఐఆర్?ఎఫ్?సీ) నుంచి రుణ సదుపాయం, హైదరాబాద్ నగర రవాణా వ్యవస్థ విస్తరణ, ఇతర అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రజల సంక్షేమానికి కృషి చేస్తాను : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్?తో సమావేశం ఏర్పాటు చేయమని కోరుతూ తనకు రెండుసార్లు లేఖ రాశారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎక్స్ వేదికగా తెలిపారు. గత రెండు రోజులుగా తాను ఢిల్లీలో తెలంగాణ ముఖ్యమంత్రికి కేంద్ర మంత్రులతో సమావేశాలు ఏర్పాటు చేశానన్నారు. సోమవారం అశ్వినీ వైష్ణవ్?తో జరిగిన సమావేశం, కేంద్ర మంత్రి ఖట్టర్, అశ్వినీ వైష్ణవ్?లతో జరిగిన సంయుక్త సమావేశం అనుకూల వాతావరణంలో జరిగాయని తెలిపారు. కేంద్ర మంత్రివర్గంలో తెలంగాణ ప్రతినిధిగా, తాను ఎల్లప్పుడూ తెలంగాణ అభివృద్ధికి, రాష్ట్ర ప్రజల సంక్షేమానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు.

# పెట్టుబడుల స్థాపనకు పెద్దపీట

- 80కిపైగా అజెండా అంశాలకు కేబినెట్ ఆమోదం
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం



**టీ మీడియా, జూన్ 23, అమరావతి బ్యూరో :** రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పెట్టుబడుల స్థాపనకు పెద్దపీట వేస్తూ మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. పరిశ్రమలు, ఐటీ, పర్యాటకం, రాజధాని అభివృద్ధి, డేటా సెంటర్లు, పునరుత్పాదక ఇంధన రంగానికి సంబంధించిన ప్రతిపాదనలకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. పెట్టుబడుల ప్రోత్సాహక మండలిలో తీసుకున్న దాదాపు రూ.34,000ల కోట్ల పెట్టుబడుల స్థాపన ద్వారా 35,000ల ఉద్యోగాల కల్పనకు సంబంధించిన నిర్ణయాలకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం దాదాపు 80కి పైగా అజెండా అంశాలకు ఆమోదం తెలిపింది. అమరావతి పరిధిలోని ఉండవల్లి ప్రాంతంలో రూ.426 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన పనులకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఏపీ జ్యుడీషియల్ అకాడమీ నిర్మాణానికి రూ.130 కోట్ల పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అమరావతిలో 5 స్టార్ హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లకు ప్రోత్సాహకాలు ఇచ్చే ప్రతిపాదనలకు మంత్రిమండలి ఆమోదించింది.

### పర్యాటక ప్రాజెక్టులకు అంగీకారం

విశాఖ, తిరుపతి, కర్నూలు, అన్నవరం ప్రాంతాల్లోనూ పర్యాటక ప్రాజెక్టులకు కేబినెట్ అంగీకారం తెలిపింది. ప్రభుత్వరంగ సంస్థలు, కార్పొరేషన్లు, సొసైటీల ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచుతూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. అనంతపురం, కడప జిల్లాల్లో సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులకు భూముల కేటాయింపు, బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు ఇచ్చే ప్రతిపాదనలకు మంత్రిమండలి ఆమోద ముద్ర వేసింది. కేబినెట్? ఆమోదం తెలిపిన అజెండాలో ఉన్న పలు కీలక ప్రాజెక్టులను పరిశీలిస్తే పరిశ్రమలు, తయారీ రంగంలో సుమారు రూ.22,000ల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపింది. ఐటీ, డేటా సెంటర్లు, ఎలక్ట్రానిక్స్ రూ.5300 కోట్లకు పైగా పెట్టుబడులను ఆమోదించింది. ఫుడ్ ప్రాసెసింగ్, పతంజలి, న్యూట్రిఫీడ్స్ రూ.586 కోట్ల పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అదేవిధంగా రక్షణ, ఏరోస్పేస్ ప్రాజెక్టుల ద్వారా వందల కోట్ల పెట్టుబడులు లభించాయి.

### రానున్న ఉద్యోగాలు :

విశాఖలో ఇన్ఫినిక్స్ ఐటీ క్యాంపస్ ద్వారా 4000ల ఉద్యోగాలు రానున్నాయి. రాయలసీమలో రాయల్ ఎన్?ఫీల్డ్ తయారీ యూనిట్ ద్వారా 3000ల ఉద్యోగాలు లభించనున్నాయి. శ్యామ్ మెటాలిక్స్ స్టీల్ కాంప్లెక్స్ ద్వారా 3200 మందికి ఉపాధి లభించనుంది. ప్రీమియర్ ఎనర్జీస్ విస్తరణ ప్రాజెక్టుల ద్వారా 3040 కొలువులు రానున్నాయి. పతంజలి ఫుడ్ అండ్ హెర్బల్ పార్క్ ద్వారా 2000ల మందికి ఉపాధి లభించనుంది. ఎంసీఎన్ఎక్స్ ఇండియా ఆటోమోటివ్ కెమెరా మాడ్యూల్స్ యూనిట్ ద్వారా 1633 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. బాల్ బెవరేజెస్, యాక్షన్ టెసా తదితర ప్రాజెక్టులు 1500ల ఉద్యోగాలు లభించనున్నాయి. జెట్ఫ్యాబ్ పీసీబీ తయారీ యూనిట్ ద్వారా 1049 మందికి ఉపాధి లభించనుంది. అదేవిధంగా బీసీ బిడ్డల విద్యకు కూటమి ప్రభుత్వం భరోసా కల్పించింది. 10 ఎంజేపీ గురుకులాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటిని ఎచ్చెర్ల(శ్రీకాకుళం), నక్కపల్లి(అనకాపల్లి), మాచర్ల(పల్నాడు), గిద్దలూరు(మార్కాపురం), గుంతకల్లు(అనంతపురం), రాయచోటి(అన్నమయ్య), పత్తికొండ, మంత్రాలయం(కర్నూలు), పెనుకొండ, కదిరి(శ్రీసత్యసాయి)లో ఏర్పాటు చేయనున్నారు. ఇందులో ఐదు బాలికలవి కాగా మరో ఐదు బాలురవి. అదేవిధంగా ఒక్కో గురుకులంలో 37 పోస్టులు భర్తీ చేయనున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచే ఇవి ప్రారంభం కానున్నాయి. అమరావతి ల్యాండ్ పూలింగ్ స్కీమ్ ఒకటి, రెండో దశల కోసం సీఆర్డీఏ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లకు సంబంధించి 95 తాత్కాలిక పోస్టుల మంజూరుకు కేబినెట్ ఆమోదం లభించింది. మచిలీపట్నం, రామాయపట్నం పోర్టుల పరిధిని 15 కిలోమీటర్లకు హేతుబద్ధీకరిస్తూ నిర్ణయం తీసుకుంది.

### సీపీఎస్ ప్రభుత్వం శుభవార్త

మరోవైపు సీపీఎస్ ఉద్యోగులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వెటరన్, ఫ్యామిలీ సీపీఎస్ కంట్రిబ్యూషన్పై కేబినెట్ స్పష్టత ఇచ్చింది. ఉద్యోగుల గ్రాట్యుటీ మేరకు ఫ్యామిలీ పెన్షన్ మంజూరు చేయాలని నిర్ణయం తీసుకుంది. 2017 నుంచి పెండింగ్లో ఉన్న ఈ సమస్యను సర్కార్ పరిష్కరించింది. దీంతో రాష్ట్రంలోని 11,000ల మంది సీపీఎస్ ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది. జీఓఎమ్ నంబర్ 57 అమలుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై సచివాలయ సీపీఎస్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్కు కృతజ్ఞతలు తెలిపింది. కేబినెట్ సమావేశంలో ప్రభుత్వం, ఉద్యోగులకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకుందని ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు విద్యాసాగర్ తెలిపారు.

# హర్మ్యూజ్ దాటి భారత్కు ఎరువుల నౌకలు



**టీ మీడియా, జూన్ 23, ఢిల్లీ బ్యూరో:**

దేశంలో ఖరీఫ్ సాగు పనులు ఊపందుకుంటున్న వేళ కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ రైతులకు తీపి కబురు అందించింది. అంతర్జాతీయంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా అత్యంత సమస్యాత్మకంగా మారిన 'హర్మ్యూజ్ జలసంధి' వ్యూహాత్మక మార్గం నుండి ఎరువుల ముడిసరుకుతో వస్తున్న నాలుగు భారీ కార్గో నౌకలు సురక్షితంగా బయటపడ్డాయి. ప్రస్తుతం ఇవి భారత తీరం వైపు ప్రయాణిస్తున్నాయి. వ్యవసాయానికి ఎంతో అవసరమైన యూరియా, డీఏపీ , సల్ఫర్ వంటి సుమారు 1.8 లక్షల టన్నుల రసాయన ఎరువుల ముడిసరుకు ఈ నౌకల్లో ఉంది. ఇవి త్వరలోనే ఆంధ్రప్రదేశ్లోని కాకినాడ, కృష్ణపట్నంతో పాటు ఒడిశాలోని పారాదీప్, గుజరాత్లోని ముంద్రా రేవులకు చేరుకోనున్నాయి.

### రికార్డు స్థాయిలో ఎరువుల నిల్వలు

హర్మ్యూజ్ జలసంధి వద్ద రవాణా ఆంక్షల నేపథ్యంలో దేశంలో ఎరువుల కొరత ఏర్పడుతుందేమోనని వ్యక్తమైన ఆందోళనలకు ఈ పరిణామంతో తెరపడింది. ప్రస్తుత గణాంకాల ప్రకారం, జూన్ 22 నాటికి దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 196.08 లక్షల టన్నుల ఎరువుల నిల్వలు సిద్ధంగా ఉన్నాయి. గత ఏడాది ఇదే సమయానికి ఉన్న 168.67 లక్షల టన్నుల నిల్వలతో పోలిస్తే ఇది చాలా ఎక్కువ. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నిల్వల్లో 81.44 లక్షల టన్నుల యూరియా, 20.92 లక్షల టన్నుల డీఏపీ ఉన్నాయి. మార్చి 1 నుండి జూన్ 21 వరకు దేశీయంగా ఎరువుల విక్రయాలు కూడా గత ఏడాదితో పోలిస్తే 13.2 లక్షల టన్నులు పెరిగి, మొత్తం 153.4 లక్షల టన్నులకు చేరడం గమనార్హం.

### రికార్డు స్థాయి దేశీయ ఉత్పత్తి..

విభిన్న దేశాల నుండి క్రమబద్ధమైన దిగుమతులుసరఫరా గొలుసు దెబ్బతినకుండా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల దేశీయంగా ఎరువుల ఉత్పత్తి రికార్డు స్థాయిలో 133.12 లక్షల టన్నులకు చేరింది. కేవలం ఒకే మార్గంపై ఆధారపడకుండా రష్యా, ఒమన్, ఖతార్, ఈజిప్ట్ వంటి వివిధ దేశాల నుండి విభిన్న మార్గాల ద్వారా దిగుమతులను క్రమబద్ధీకరించడం వల్ల ఈ బ్యాలెన్స్ సాధ్యమైందని అధికారులు వెల్లడించారు.

## ఆధార్ తో పాన్ ఇంకా లింక్ చేయలేదా..?
# సేవలన్నీ బంద్

**టిమీడియా, జూన్23, ఢిల్లీ బ్యూరో:**



ఆధార్ కార్డు-పాన్ కార్డు లింకింగ్ను కేంద్ర ప్రభుత్వం తప్పనిసరి చేసిన విషయం తెలిసిందే. ఆదాయపు పన్ను చట్టం, 1961లోని సెక్షన్ 139ఏఏ ప్రకారం ఆధార్-పాన్ అనుసంధానం తప్పనిసరిగా చేసుకోవాలి. జూలై 1, 2017న లేదా అంతకంటే ముందు మీరు గ్రాంచీ పాన్ పొంది ఉంటే ఆధార్ నంబర్ను ఖచ్చితంగా లింక్ చేసుకోవాలి. ఉచితంగా లింక్ చేసుకునేందుకు ఇన్కమ్ ట్యాక్స్ డిపార్ట్మెంట్ ఇచ్చిన గడువు ముగిసిపోయింది. దీంతో ఇప్పుడు రూ. 1,000 జరిమానా చెల్లించి ప్రక్రియను పూర్తి చేయవచ్చు. మీరు ఈ ప్రక్రియను పూర్తి చేయకపోతే మీపాన్ కార్డు ఇనాక్టివ్ లేదా బ్లాక్ అయ్యే అవకాశం ఉంది. దీనివల్ల అనేక రకాల ఆర్థిక, పన్ను సంబంధిత లావాదేవీలలో ఆటంకాలు ఏర్పడే ఛాన్స్ ఉంటుంది.

### ఎవరికి మినహాయింపు ఉంది?

అస్సాం, జమ్మూ కాశ్మీర్, మేఘాలయ నివాసితులకు దీని నుంచి మినహాయింపు ఉంది. ఇక 1961 ఆదాయపు పన్ను చట్టం ప్రకారం నిర్వచించబడిన ప్రవాసులకు కూడా ఈ మినహాయింపు వర్తిస్తుంది. త ఆర్థిక సంవత్సరంలో 80 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్నవారు, భారత పౌరులు కానివారు తమ పాన్ను ఆధార్తో అనుసంధానం చేయాల్సిన అవసరం లేదు.

### రూ. వెయ్యి ఫీజు ఎలా చెల్లించాలి..?

పాన్-ఆధార్ లింక్ చేసుకోవాలంటే ముందుగా జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకోసం ఆదాయపు పన్ను ఇ-ఫైలింగ్ పోర్టల్ సందర్శించాలి. ఇ-పే ట్యాక్స్ విభాగానికి వెళ్లి, సంబంధిత పన్ను సంవత్సరాన్ని ఎంచుకోవాలి. అనంతరం చెల్లింపు విభాగాన్ని ఎంచుకుని చెల్లింపును పూర్తి చేయాలి. అనంతరం లింకింగ్ ఆప్షన్లోకి వెళ్లాలి. ఇన్కమ్ ట్యాక్స్ ఈ-ఫైలింగ్ వెబ్ సైట్లోకి వెళ్లి ఆన్లైన్ ద్వారా లింక్ చేసుకోవచ్చు. లేదా సమీపంలో పాన్ కార్డు కార్యాలయం లేదా అధీకృత ఏజెంట్ల దగ్గరికి వెళ్లి లింక్ చేసుకోవచ్చు.

# తెలంగాణలో తొలి రోప్వే..


## వెయ్యేళ్ల చరిత్రకు ఆధునిక హంగులు.. ఎక్కడంటే?

**టీ మీడియా, జూన్ 23, భువనగిరి :**

తెలంగాణ పర్యాటక రంగంలో మరో కీలక మైలురాయికి తెరలేవబోతోంది. రాష్ట్రం లోనే తొలిసారిగా రోప్వే టూరిజం అందుబాటులోకి రానుంది. చరిత్ర, సాహసం, ప్రకృతి అందాలకు నిలయమైన భువనగిరి కోటపై రోప్వే ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. చారిత్రాత్మక భువనగిరి కోటను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అడుగులు వేస్తోంది. పర్యాటకులకు కొత్త అనుభూతిని పంచేలా భువనగిరి కోటపై రోప్వే టూరిజంను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు పర్యాటకశాఖ కసరత్తు చేస్తోంది. రాష్ట్రాన్ని దేశ, విదేశీ పర్యాటకుల డెస్టినేషన్ సెంటర్ గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రేవంత్ సర్కార్ ప్రణాళికలను రూపొందిస్తోంది. ఇప్పటికే ఉన్న పర్యాటక ప్రాంతాలను ప్రపంచ స్థాయి సౌకర్యాలతో అభివృద్ధి చేయడంతో పాటు కొత్త ఆకర్షణలను అందుబాటులోకి తీసుకురావడంపై ఫోకస్ పెట్టింది. దాదాపు వెయ్యేళ్ల చరిత్ర కలిగిన భువనగిరి కోట తెలంగాణ వారసత్వ సంపదలో ఒకటి. భువనగిరి ఖిల్లా సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో సముద్ర మట్టానికి 610 మీటర్ల (సుమారు 3000 అడుగులం) ఎత్తులో ఉన్న ఏకశిలా పర్వతం. 10 నుంచి 11శతాబ్దంలో పశ్చిమ చాళుక్య రాజు త్రిభువనమల్ల విక్రమాదిర్చుడు ఈ ఖిల్లాపైన దుర్భేధ్యమైన కోట గోడను నిర్మించాలని ప్రసిద్ధి. పై భాగం నుంచి అండాకారంలో కనిపించడం ఖిల్లా ప్రత్యేకత.

### స్వదేశ్ దర్శన్ కింద రూ.56.81 కోట్లతో భారీ ప్రాజెక్టు

కేంద్రం ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మక పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రవేశపెట్టిన 'స్వదేశీ దర్శన్ స్కీమ్ 2.0' కింద తెలంగాణలోని భువనగిరి కోటను ఎంపిక చేసింది. ఈ పథకం ద్వారా "భువనగిరి ఫోర్ట్ ఎక్స్పీరియన్షియల్ జోన్" ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం రూ.56.81 కోట్ల భారీ నిధులను మంజూరు చేసింది. భువనగిరి ఖిల్లా పక్కనే ఉన్న హైదరాబాద్-వరంగల్ 165వ నేషనల్ హైవే నుంచి కోట వద్దకు దాదాపు కిలో మీటరు దూరం వరకు రోప్వే ఏర్పాటు చేయనున్నారు. ఇది అందుబాటులోకి వస్తే.. రాష్ట్రంలో తొలి రోప్వేగా ఇది గుర్తింపు సాధించనుంది. ట్రెక్కింగ్ ప్రాధాన్యమున్న ప్రాంతాల్లో భువనగిరి కోట ఒకటి కాగా.. ప్రస్తుతం కోటపైకి చేరడానికి దాదాపు గంట సమయం పడుతోంది. చాలా మంది టూరిస్టులు ఈ కోటను సందర్శిస్తుంటారు. ఈ నేపథ్యంలో టూరిస్టులకు కొత్త అనుభూతిని ఇచ్చేందుకు రోప్ వే నిర్మాణ పనుల కొనసాగుతున్నాయి. ఇందుకోసం రెండు దఫాలుగా సుమారు ఐదెకరాల ప్రైవేటు భూములను సేకరించి నిర్వాసితులకు సుమారురూ. 4 కోట్ల పరిహారం అందజేశారు. ఈ మేరకు బేస్ క్యాంప్, రోప్వే పిల్లర్ల పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుత మెట్ల మార్గంలో అవసరమైన చోట నూతన మెట్లను చెక్కుతున్నారు. అన్ని ద్వారాలకు, ఇతర కట్టడాలకు మరమ్మతులు చేయనున్నారు. ఈ ఆధునీకీకరణ పనులను దంగు సున్నంతో చేపట్టడం విశేషం. ఖిల్లాపై బేస్ క్యాంపు వద్ద రెస్టారెంట్లు, గ్రీనరీ సౌకర్యాలను కల్పించనున్నారు. నల్లగొండ రోడ్డులో ఉన్న ఖిల్లా ప్రధాన మార్గాన్ని ఆధునికరించనున్నారు. రూ. 30కోట్ల వ్యయంతో ఖిల్లా పై స్విమ్మింగ్ పూల్, వివాహాలకు అనువుగా డెస్టినేషన్ వెడ్డింగ్ కోసం నిర్మాణాలు చేపడుతున్నారు.



### గంటకు ఖిల్లాపైకి 300 మంది పర్యాటకులు!


భువనగిరి ఖిల్లా వద్ద జరుగుతున్న రోప్ వే పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కోటపై నిర్మిస్తున్న రోప్వే, హోటల్, పార్కింగ్ వసతులు, విశ్రాంతి గదులు, పిల్లల ఆట స్థలం, కోట పునరుద్ధరణ పనులు, కెఫెటేరియా, ఇంటర్ప్రిటేషన్ సెంటర్, పర్యాటకులకు అవసరమైన ఇతర వసతుల పురోగతిని అధికారులతో కలిసి సోమవారం సమీక్షించారు. ఖిల్లా వద్ద సాగుతున్న పనులన్నింటినీ రానున్న అక్టోబర్ 2వ తేదీ, గాంధీ జయంతి నాటికి పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టులను నిరంతరం పర్యవేక్షించడంతో పాటు, అవసరమైతే రాత్రింబగళ్లు షిఫ్టుల వారీగా పనులు జరిగేలా చూడాలని స్పష్టం చేశారు. భువనగిరి కోట చారిత్రక వైభవాన్ని ఏమాత్రం దెబ్బతీయకుండా, దానికి ఆధునికంగా నిర్మాణాలు ఉండాలని అన్నారు. ఈ రోప్ వే పూర్తి అయితే ఖిల్లా పైకి గంటకు 300 మంది పర్యాటకులు వెళ్లే అవకాశం ఉంటుంది. ఈ రోప్ వే సెకండ్ కు 6 మీటర్ల గరిష్ట వేగంతో సాగుతుంది.

### టూరిజం సర్క్యూట్..

యాదగిరిగుట్ట, భువనగిరి కోట, కొలనుపాకలను కలుపుతూ ఒక సమగ్ర ఆధ్యాత్మిక, వారసత్వ టూరిజం సర్క్యూట్ను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలను రూపొందిస్తోంది. ఈ టూరిజం సర్క్యూట్ ను రూపొందించేందుకు ప్రభుత్వం కసరత్ చేస్తోంది. ఇది అమలైతే దేశీయ, విదేశీ పర్యాటకులు ఒకే ప్రాంతంలో ఆధ్యాత్మిక, చారిత్రక, సాంస్కృతిక అనుభూతులను పొందే అవకాశం ఉంటుంది. యాదాద్రి లక్ష్మి నరసింహ స్వామి క్షేత్రం, నాగార్జునసాగర్ బుద్ధవనం, అనంతగిరి కొండలను ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు కల్పనకు చేపట్టే చర్యలకు సంబంధించిన డిటైల్ ప్రాజెక్టు రిపోర్టును అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఈ నివేదికను కేంద్ర ప్రభుత్వం పరిశీలించి నిధులను మంజూరు చేయనుంది.

# పెరియార్ సిద్ధాంతాలు ఓకే

- నాస్తికత్వాన్ని అంగీకరించం
- అసెంబ్లీ వేదికగా సీఎం విజయ్



**టిమీడియా, జూన్23, చెన్నైబ్యూరో:** తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త శకానికి నాంది పలికి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన జోసెఫ్ విజయ్ (దళపతి విజయ్) అసెంబ్లీ వేదికగా తన ప్రభుత్వ భావజాలాన్ని స్పష్టం చేశారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై అసెంబ్లీలో జరిగిన చర్చలో సీఎం విజయ్ మాట్లాడారు. ద్రావిడ ఉద్యమ మూలపురుషుడు పెరియార్ రామస్వామి సామాజిక సిద్ధాంతాలను తాము మనస్ఫూర్తిగా స్వీకరించినప్పటికీ, ఆయన ప్రబోధించిన నాస్తికత్వ భావజాలాన్ని మాత్రం తాము అంగీకరించడం లేదని తేల్చి చెప్పారు. తాము దేవుడిని బలంగా విశ్వసిస్తామని, ఈ విషయాన్ని ఎప్పుడూ దాచాల్సిన అవసరం లేదని సభలో ప్రకటించారు. తమ నూతన ప్రభుత్వానికి పెరియార్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, తమిళనాడు మాజీ సీఎం కామరాజ్ సిద్ధాంతాలే పాలకులని విజయ్ పేర్కొన్నారు. సమాన అవకాశాలు, సామాజిక న్యాయ సాధన కోసం అంబేద్కర్ ఆలోచనలను, నిజాయతీతో కూడిన ఆదర్శవంతమైన పాలన కోసం కామరాజ్ విధానాలను తాము స్ఫూర్తిగా తీసుకున్నట్లు వెల్లడించారు.

### విమర్శకులకు కౌంటర్

తమ పార్టీ కేవలం ఒక సినీ నటుడి పార్టీ మాత్రమేనని విమర్శించే వారికి సీఎం విజయ్ గట్టి కౌంటర్ ఇచ్చారు. ఈ ఎదుగుదలను జీర్ణించుకోలేక కొందరు అలా మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ ఎలాంటి పొత్తులు లేకుండా ఒంటరిగానే బరిలోకి దిగి రికార్డు స్థాయిలో 35 శాతం ఓట్లు సాధించిందని విజయ్ గుర్తు చేశారు. రాష్ట్రంలో ఏకంగా 1.72 కోట్ల మంది ఓటర్ల మద్దతు పొంది తమ పార్టీ స్వతంత్ర రాజకీయ శక్తిగా అవతరించిందని ధీమా వ్యక్తం చేశారు. మతం, కులం అనే కృత్రిమ గోడలను బద్దలు కొట్టి, ముందుగా ప్రజల వద్దకు వెళ్లి వారి నమ్మకాన్ని గెలుచుకున్నాకే తాము పార్టీని స్థాపించామని చెప్పారు. తాము రాజకీయ ప్రత్యర్థులకు, భావజాల పరమైన ప్రత్యర్థులకు మధ్య స్పష్టమైన వ్యత్యాసాన్ని పాటిస్తామని వివరించారు. సభలో విజయ్ చేసిన కొన్ని వ్యాఖ్యలు తీవ్ర కలకలం రేపాయి. గత ప్రభుత్వం (డీఎంకే) పార్టీ నిధుల పేరుతో భారీ ఎత్తున అవినీతికి, అక్రమాలకు పాల్పడిందని సీఎం విజయ్ తీవ్ర ఆరోపణలు చేశారు. దీనిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ డీఎంకే సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. ఇదే సమయంలో వామపక్షాల చేరికపై కూడా ఆయన మాట్లాడారు. వామపక్ష పార్టీలు తమ కూటమిలోకి ఎవరి దయాదాక్షిణ్యాల వల్లో రాలేదని, అవి స్వచ్ఛందంగానే తమతో చేతులు కలిపాయని విజయ్ స్పష్టం చేశారు. విజయ్ చేసిన ఈ సంచలన వ్యాఖ్యలు ప్రస్తుతం తమిళనాడు రాజకీయాల్లో పెను సంచలనంగా మారాయి.

## ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి నివాసంలో ఏసీబీ దాడులు

2లో..

# అంగన్‌వాడీల్లో కొలువుల జాతర

● 15,982 ఖాళీల భర్తీకి రంగం సిద్ధం

**టీ మీడియా, జూన్ 23,హైదరాబాద్ బ్యూరో :**

తెలంగాణ రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉద్యోగాల భర్తీకి రంగం సిద్ధమైంది. భారీ సంఖ్యలో 15,982 పోస్టులను సర్కారు భర్తీ చేయనుంది. ఆయా జిల్లాల్లో ఐసీడీఎస్(ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్) ప్రాజెక్టుల వారీగా ఖాళీలను గుర్తించిన శిశు సంక్షేమ శాఖ, భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేస్తోంది. ఇప్పటికే పెద్దపల్లి జిల్లాలో టీచర్ పోస్టులు, మహబూబ్‌నగర్‌లోని 4 ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో టీచర్లు, సహాయకులు కలిపి 177 పోస్టులకు ఆయా జిల్లా కలెక్టర్లు ఉద్యోగ నోటిఫికేషన్లను జారీ చేశారు. అన్ని జిల్లాల్లో ఇదే తరహాలో వేర్వేరుగా ప్రకటనలు ఇచ్చి ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు.



**ఇంటర్మీడియట్ తప్పనిసరి**

'సక్షం' అంగన్‌వాడీ నిబంధనల ప్రకారం అంగన్‌వాడీ టీచర్, సహాయకుల పోస్టుల భర్తీకి ఇంటర్మీడియట్ (10+2) విద్యార్హతను రాష్ట్ర ప్రభుత్వం ఈసారి తప్పనిసరి చేసింది. అలాగే పోస్టుల భర్తీలో ఈసారి కొత్తగా ఇంటర్వ్యూ విధానాన్ని తీసుకువచ్చింది. ఈ మేరకు అంగన్‌వాడీ పోస్టుల భర్తీ చేయడానికి ప్రభుత్వం ఇటీవల అనుమతిని ఇచ్చింది.

**కొత్తగా ఇంటర్వ్యూ విధానం**

తాజాగా ఎంపిక విధానంలో ఇంటర్వ్యూకు అనుమతిస్తూ జీవో నంబరు 04, మార్కుల వెయిటేజీ ఖరారు చేస్తూ జీవో నంబరు 06ను సైతం జారీ చేసింది. ఆ ప్రకారం మల్టీజోన్–1(ఉత్తర తెలంగాణ) పరిధిలోని మొత్తం 20,584 అంగన్‌వాడీ సెంటర్లలో 1,853 టీచర్లు, 7,737 సహాయకుల పోస్టులు కలిపి మొత్తం 9,590 ఖాళీలు అందుబాటులో ఉన్నాయి. మల్టీ జోన్–2 (దక్షిణ తెలంగాణ) పరిధిలో 15,197 అంగన్‌వాడీ కేంద్రాల్లో 1247 టీచర్లు, 5145 సహాయకులు కలిపి 6,392 ఖాళీలను గుర్తించారు.

**సుదీర్ఘ అధ్యయనం అనంతరం భర్తీకి గ్రీన్? సిగ్నల్**

వాస్తవంగా ఈ అంగన్?వాడీ టీచర్, సహాయకుల పోస్టులు భర్తీ చేయాలని ఏడాదిన్నర క్రితమే సర్కారు నిర్ణయించింది. నియామక విధానం, ఇతర రాష్ట్రాల్లో అనుసరిస్తున్న సర్వీసు నిబంధనలు, తదితర అంశాలపై సర్వే చేసి నియామక విధానాన్ని ఇటీవల ఖరారు చేసింది.

**అర్హతలు ఏం కావాలంటే?**

అంగన్‌వాడీ పోస్టుకు దరఖాస్తు చేసే అభ్యర్థులు తెలంగాణలోని పట్టణాలు లేదా గ్రామాల్లో సంబంధిత వార్డులో స్థానికులై ఉండాలి. గిరిజన, ఆదివాసీ తండాలు, గూడేలు, ఆవాసాల్లో పోస్టులకు సంబంధిత ఆవాస ఎస్టీ మహిళలే అర్హులు. ఎస్సీ వాడల్లోని పోస్టులకు స్థానిక ఎస్సీ మహిళలే అర్హులుగా ఉంటారు.అంగన్‌వాడీ టీచర్ పోస్టుల భర్తీకి ఆ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని జిల్లా ఎంపిక కమిటీ (డీఎస్సీ) మాత్రమే అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తుంది. ఇంటర్వ్యూకు 10 మార్కులను ప్రభుత్వం కేటాయించింది.

టీచర్లు, సహాయకుల పోస్టులకు అప్లై చేసేందుకు ఇంటర్మీడియట్(10+2) పాసై ఉండాలి. సహాయకుల పోస్టులకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అందుబాటులో లేనిపక్షంలో తదుపరి పదో తరగతి పాసైన వారిని పరిగణనలోకి తీసుకోవాలని ఎంపిక నిబంధనల్లో ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంది. ఎంపికలో మార్కులకు వెయిటేజీ కూడా ఉంటుంది. ఇంటర్‌లో వచ్చిన మార్కులకు 70 శాతం, వితంతువులకు 5 శాతం, అనాథలకు 10 శాతం, దివ్యాంగులకు 5 శాతం చొప్పున వెయిటేజీ ఉంటుంది. ఇంటర్వ్యూలకు పది మార్కులుగా నిర్ణయించారు.

జిల్లాల వారీగా ఖాళీలు ఇలా :
జి ల్లా టీచర్లు సహాయకులు, ఆసిఫాబాద్ 182 452,మంచిర్యాల 110 398, పెద్దపల్లి 56 252,భూపాలపల్లి 50133,ములుగు 95 319,ఆదిలాబాద్ 176 628,నిర్మల్ 80 435,నిజామాబాద్ 80 601,జగిత్యాల 70 352, కరీంనగర్ 56 230,సిరిసిల్ల 57 181,సిద్దిపేట 84 271,మెదక్ 63 345, కామారెడ్డి 106 445,కొత్తగూడెం 192 1033,ఖమ్మం 136 655,మహబూబాబాద్ 116 478,వరంగల్ 63 289,హనుమకొండ 71 240,సూర్యాపేట 84 321, నల్గొండ 148 688,యాదాద్రి భువనగిరి 62 270,జనగామ 27 187,మేడ్చల్ 64 227,హైదరాబాద్ 183 402,రంగారెడ్డి 137 611,సంగారెడ్డి80416,వికారాబాద్ 94 399,మహబూబ్ నగర్ 62 364,నారాయణ పేట 32 196,గద్వాల 65 308, వనపర్తి 47 203,నాగర్?కర్నూల్ 162 553,

**హాజరును పెంచాలి**

రాష్ట్రవ్యాప్తంగా అంగన్?వాడీల్లో గర్భిణులు, బాలింతల హాజరును పెంచేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఇటీవల మంత్రి సీతక్క నిర్ణయించారు. ఆయా జిల్లాల్లో సర్వే ద్వారా గుర్తించిన గర్భిణులు, బాలింతలు, ఆరేళ్లలోపు చిన్నారులను తప్పనిసరిగా అంగన్‌వాడీల లబ్ధిదారులుగా చేర్చాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. 12,276 అంగన్‌వాడీలకు శాశ్వత భవనాల నిర్మాణాన్ని ప్రారంభించారు. 2024–25 ఏడాదికి 886 భవనాల నిర్మాణానికి ఆమోదం తెలపగా 220 చోట్ల పనులు కొనసాగుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 1,174 కేంద్రాలకు శాశ్వత భవనాలను ఏర్పాటు చేయనున్నారు.

## పేరుకు పెద్దాసుపత్రి 5 నెలల నుండి జీతాలు లేవు

● ఉస్మానియా ఔట్‌సోర్సింగ్

**టిమీడియా, జూన్23, హైదరాబాద్ బ్యూరో :**



వేతనాల కోసం తెలంగాణ మెడికల్ ,హెల్త్ ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ మహాధర్నా చేపట్టారు.. మాకు పనికి తగ్గట్లు ప్రతినెలా సమయానికి జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ధర్నాలో పాల్గొన్న ఓ మహిళా ఉద్యోగి మాట్లాడుతూ.. నేను ఉస్మానియా ఆస్పత్రిలో స్టాఫ్‌నర్స్‌గా వర్క్ చేస్తున్నా. గత సంవత్సరాలుగా లివర్ ట్రాన్స్‌ప్లాంట్ ఐసీయూ విభాగంలో పని చేస్తున్నా.. నేను ఉస్మానియా ఆస్పత్రిలో పనిచేయబట్టి 7 సంవత్సరాలు అవుతుంది. మాకు 5 నెలలుగా జీతాలు లేవని ఆవేదన వ్యక్తం చేసింది.మేము రెగ్యులర్‌గా, కంటిన్యూగా డ్యూటీకి వస్తున్నాం. ఒక్క నెల పడ్డది అంతే.. ఇక మిగిలియ్ అయితే బడ్జెట్ లేదని అంటున్నారు. కానీ ఇక్కడ మాత్రం బిల్ ఉందని అంటున్నారు. కానీ ఇంతవరకు ఆ బిల్లు వెళ్లలేదు. మాకు జీతాలు కూడా రాలేదు. మేం అతి కష్టం మీద డ్యూటీకి వస్తున్నాం. చేతుల్లో డబ్బుల్లేకున్నా.. మా ఇంట్లో ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా కానీ మేం డ్యూటీ చేస్తున్నాం. ఇంట్లో మా ఫ్యామిలీలో కూడా ఎవరూ ఆరోగ్యంగా లేరని వాపోయింది.సాలరీలు లేకపోతే మీరు కూడా వెళ్లిపోండని వాళ్లు కూడా అంటున్నారు. మా దగ్గర బడ్జెట్ కూడా ఏం లేదు. మా ఆయన కూడా ఈరోజు పనిచేస్తేనే రేపు పూట గడవని పరిస్థితి మాది. మేం అలాంటి కండిషన్స్‌లో పని చేస్తున్నాం. పేరుకు పెద్దాసుపత్రి. ఇలాంటి పెద్దాసుపత్రిలో మేం డ్యూటీ చేస్తున్నమంటేనే మహా ఎక్కువ. మా వేతనాలు ప్రభుత్వమే నేరుగా ఇవ్వాలి. సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలి. ఒక రోజు తిండి ఉండి ఇంకో రోజు తిండి లేక గడుపుకుంటున్నమంటూ ఆవేదన వ్యక్తం చేసింది.ప్రజా పాలన– ప్రజా ప్రభుత్వం అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ హయాంలో అత్యవసరం వైద్య సేవలందించే ఉద్యోగుల పరిస్థితి ఎలా ఉందో వారి ఆవేదనతో అర్థం అవుతుంది.

## అగ్నిపర్వతం నుంచి భారీ విస్ఫోటనం..

● పరుగులు తీసిన పర్యాటకులు

**టిమీడియా, జూన్23,ఢిల్లీ బ్యూరో :**



మధ్య అమెరికా లోని గ్వాటెమాలా లో వోల్కన్ డీ ఫ్యూగో అగ్నిపర్వతం బద్ధలైంది. దాంతో అగ్నిపర్వతం నుంచి ఒక్కసారిగా మంటలు ఎగజిమ్మాయి. ఏకంగా 33 వేల అడుగుల ఎత్తు పొగలు విరజిమ్మాయి. అగ్నిపర్వతం నుంచి ఒక్కసారిగా మంటలు ఎగజిమ్మి, మండుతున్న రాళ్లు బుల్లెట్లలా దూసుకొచ్చాయి. దాంతో ఆ పర్వత పరిసరాల్లో ఉన్న పర్యాటకులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు తీశారు. ఈ హఠాత్పరిణామానికి సైతం పరుగందుకున్నారు.అగ్నిపర్వతం చుట్టూ శిథిలాలు పడుతుండగా పర్వతారోహకులు అగ్నిపర్వత మార్గాల వెంట పరుగెత్తుతుండటం కనిపించిందని స్థానికులు చెబుతున్నారు. ఒక వీడియోలో ఒక పర్యాటకుడు 'ఓరి దేవుడా, ఇది మరీ దారుణం. పరుగెత్తండి, పరుగెత్తండి..!' అని అరుస్తూ పరుగులు తీశాడని తెలిపారు. ఒక పర్యాటకుడు కుక్కను పట్టుకుని సురక్షిత ప్రదేశానికి తీసుకువెళుతుండగా.. మరికొందరు కింద పడుతున్న శిథిలాల నుంచి తమను తాము కాపాడుకోవడానికి ప్రయత్నించినట్లు న్యూయార్క్ పోస్ట్ తెలిపింది.కాగా, గ్వాటెమాల నగరానికి నైరుతి దిశలో సుమారు 43 కిలోమీటర్ల దూరంలో ఈ వోల్కాన్ డి ఫ్యూగో అగ్నిపర్వతం ఉన్నది. గ్వాటెమాలాలో అత్యంత చురుకైన అగ్నిపర్వతంగా ఇది పరిగణించబడుతుంది.

## పాఠశాలల బంద్ విజయవంతం


**టీ మీడియా, జూన్ 23, ఆత్మకూర్:**



అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర శాఖ పిలుపు మేరకు విద్యాసంస్థల ఫీజుల దోపిడి నియంత్రణ, విద్యా రంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ఈ బంద్ నిర్వహించబడింది.,ప్రైవేట్ పాఠశాలల ఆధ్వర్యంలో పుస్తకాలు, యూనిఫాంల విక్రయాలను నిషేధించాలి. ప్రభుత్వం విద్యా రంగ సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి మరింత ఉధృతంగా ఉద్యమాలు చేపడతామని ఏబీవీపీ హెచ్చరించింది. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండలశీ గణేష్ అధ్యక్షులు అనిల్, నవీన్ , రఘు తదితరులు పాల్గొన్నారు.

## అన్నప్రసాద ట్రస్టుకి మూడు లక్షలు విరాళం

**టీ మీడియా, జూన్ 23, ఆత్మకూర్:**



బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ బంగ్ల లక్ష్మికాంత్ రెడ్డి కుమార్తె నర్వ గ్రామానికి చెందిన కుమారి బంగ్ల శ్రేష్ఠా రెడ్డి గారు హైదరాబాద్ లోని జేఎన్టీయూ యూనివర్సిటీలో సివిల్ ఇంజినీరింగ్ లో ఎంటెక్ పూర్తి చేసి,క్యాంపస్ ఇంటర్వ్యూ ద్వారా వచ్చిన ఓ ప్రయివేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ, మొదటి మూడు నెలల శాలరీని టీటీడీ దేవస్థానంకి విరాళంగా ఇస్తానని మొక్కుకున్న బంగ్ల శ్రేష్ఠా రెడ్డి తిరుమలలోని శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్ కి ఈవో, టీటీడీ,తిరుమల పేరుమీద =ం.3,00,000/- రూపాయలను విరాళంగా ఇచ్చి మొక్కులను తీర్చుకున్నారు.

## పల్స్ పోలియో పై అవగాహన

**టీ మీడియా, జూన్ 23 ,పెబ్బేరు :**



వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలో ఉన్న ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆఫీసు నందు పెబ్బేరు శ్రీరంగాపూర్ మండలాలలో పనిచేస్తున్న అంగనవాడి టీచర్లకు ఈ నెలలో జరిగే పల్స్ పోలియో పై శిక్షణ ఇస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జ్యోతి ఈ నెల 28,29, 30 తేదీలలో అప్పుడే పుట్టిన బిడ్డ నుండి ఐదు సంవత్సరాల పిల్లలందరికీ తప్పకుండాపోలియో చుక్కలు వేయించాలని ప్రతి ఇంటిని సందర్శించి చిన్నారులందరికి వ్యాక్సిన్ తప్పకుండా వేయించాలని హెల్త్ సూపర్వైజర్ లీలమ్మ స్వరూపరాణి అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## ఆదాయానికి మించి ఆస్తుల వ్యవహారం

● ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఇంట్లో ఏసీబీ సోదాలు

**టిమీడియా, జూన్23, నిజామాబాద్ :**

నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి ఇళ్లలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. నిజామాబాద్?లోని వారి నివాసంతో పాటు హైదరాబాద్ మచ్చబొల్లారంలోని ఇంట్లోనూ తనిఖీలు జరిగాయి. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయన్న ఆరోపణలపై ఆయన బంధువులు, సన్నిహితుల ఇళ్లలోనూ దాడులు జరిగాయి.

**రూ.3 కోట్లు విలువ చేసే ఆస్తులు గుర్తింపు**

మల్లారెడ్డి ఇళ్లలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించడంతో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. దాదాపు రూ.3 కోట్లు విలువ చేసే ఆస్తులను గుర్తించారు. అదనంగా మల్లారెడ్డి ఇంట్లో రూ.3.30 లక్షల నగదు, రూ.50 వేల బ్యాంకు బ్యాలెన్స్, మూడు బ్యాంకు లాకర్లను గుర్తించారు. 4 ఇళ్లు, వాణిజ్యభవనం, 8 ఇళ్ల స్థలాలు 10.3 ఎకరాల భూమిని అధికారులు గుర్తించారు. మల్లారెడ్డి ఇళ్లు, బంధువులు, స్నేహితుల ఇళు మొత్తం 11 చోట్ల ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. మల్లారెడ్డిని అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం హైదరాబాద్?కు తరలించినట్లు సమాచారం.

## అర్ధరాత్రి వెంటాడిన మృత్యువు..

● ఇంటికి చేరకుండా మృతి చెందిన ముగ్గురు..

**టీ మీడియా, జూన్ 23, కాకినాడ :**



వారంత దినసరి కూలీలు.. పొట్టకూటి కోసం పొరుగు ప్రాంతాలకు వెళ్లి పనిచేసుకొని సాయంత్రానికి ఇంటికొచ్చేస్తారు. రోజూలాగే సోమవారం ఉదయం కూడా పనికి వెళ్లారు. రాత్రి పని ముగించుకొని ఇంటికి బయల్దేరారు. మరో 30 నిమిషాలు అయితే అందరూ ఇంటికి చేరుకొని కుటుంబ సభ్యులతో సరదాగా గడపాల్సి ఉంది. కానీ అంతలోనే వారితో విధి వింతనాటకం ఆడింది. మొత్తం 11 మంది కూలీలతో ప్రయాణిస్తున్న టాటాఏస్ వాహనం టైర్ పేలడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మరణించగా, మరో 8 మంది తీవ్రంగా గాయపడ్డారు.వివరాల్లోకి వెళ్తే.. కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణం, పిఠాపురం మండలం మల్లాం, జల్లూరు గ్రామాలకు చెంది11 మంది కూలీలు బాపట్ల జిల్లా కొల్లూరు ప్రాంతానికి ఓ కెమికల్ ఫ్యాక్టరీ నిర్మాణ పనుల నిమిత్తం వెళ్లారు. సాయంత్రం రెడీమిక్స్ వాల్స్ పనులు పూర్తి చేసుకుని మిగిలిన సామగ్రితో టాటాఏస్ వాహనంలో ఇంటికి బయల్దేరారు. అయితే వారు ప్రయాణిస్తున్న వాహనం వడిశలేరు– రంగంపేట సమీపంలోకి రాగానే టైర్ పేలడంతో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సామర్లకోటకు చెందిన మసకపల్లి బాబు, మురమర్ల రాజు, కాకడ రాజు అనే ముగ్గురు కూలీలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో 8 మంది గాయాలతో బయటపడ్డారు.ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటీని అక్కడికి చేరుకున్న పోలీసులు తొలత గాయపడిన వారిని అంబులెన్స్ సహాయంతో పెద్దాపురం ప్రభుత్వం హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం మృతదేహాలను స్వాధీనం చేసుకొని పోస్ట్‌మార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# భగ్గుమన్న పాతకక్షలు

● హత్యకు ప్రతీకారంగా మరో హత్య

**టిమీడియా, జూన్23, మెదక్ :**





పాత కక్షల నేపథ్యంలో పథకం ప్రకారం ఓ యువకుడిని ఆటోతో ఢీకొట్టి సోమవారం హత్య చేశారు. ఈ హత్యకు ప్రతీకారంగా మృతుడి బంధువులు అతని హత్యకు కారకుడైన వ్యక్తి తండ్రిని రాత్రి హత్య చేశారు. ఈ సంఘటన మెదక్ జిల్లాలో సంచలనంగా మారింది.

**ఆటోతో ఢీకొట్టి హత్య**


జిల్లాలోని చిన్న శంకరం పేట మండలం సూరారం గ్రామానికి చెందిన శ్రీధర్ అనే యువకుడు సోమవారం చేగుంట మండలం అనంతసాగర్?కు బైక్ మీద వెళ్తున్నాడు. అదే సమయంలో ఆటోతో ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయాడు. సూరారం గ్రామానికే చెందిన రణబోయిన ప్రభాకర్ అనే వ్యక్తి పాత కక్షలను మనసులో పెట్టుకొని పథకం ప్రకారం బైక్ మీద వెళ్తున్న శ్రీధర్?ను ఆటోతో ఢీకొట్టి హత్య చేశాడని మృతుని బంధువులు ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు.

**హల్దీ వాగులో పడేశారు**

తమను న్యాయం జరిగే వరకు శ్రీధర్ డెడ్ బాడీ తీసుకెళ్లమని బంధువులు తేల్చి చెప్పారు. తూప్రాన్ డీఎస్పీ నరేందర్ చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని నచ్చజెప్పి శ్రీధర్? మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో మాసాయిపేటలోని ఓ డాబా వద్ద శ్రీధర్ బంధువులకు ప్రభాకర్ తండ్రి యాదగిరి కనిపించాడు. ఆగ్రహంతో ఉన్న శ్రీధర్ బంధువులు యాదగిరిపై దాడి తీవ్రంగా కొట్టారు. అంతేగాక అతన్ని అక్కడి నుంచి తీసుకెళ్లి బండ రాయితో కొట్టి హల్దీ వాగులో పడేశారు. దీంతో యాదగిరి ప్రాణాలు కోల్పోయాడు.పోలీసుల ముందు లొంగిపోయినట్లు సమాచారం : ఈ విషయం తెలిసిన పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వాగులో నుంచి యాదగిరి మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం యాదగిరి మృతదేహాన్ని నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా యాదగిరిని హత్య చేసిన వారు పోలీసులకు లొంగిపోయినట్టు తెలుస్తోంది.

## కబ్జాలు, వివాదాలతో రూ. 100 కోట్ల ఆస్తులు పోగొట్టుకున్న నటుడు

**టీ మీడియా, జూన్ 23,హైదరాబాద్ బ్యూరో :**



తెలుగు సినీ పరిశ్రమలో సుదీర్ఘ కాలం పాటు తనదైన ముద్ర వేసిన నటుడు చంద్రమోహన్. ఆయన జీవితం, ప్రస్థానం అనేకమందికి ఆదర్శప్రాయం. సుమారు ఐదు దశాబ్దాలకు పైగా సినీ రంగంలో కొనసాగి, హీరోగా, సహాయ నటుడిగా, తండ్రి పాత్రల్లో తన నటనతో విశేషంగా ఆకట్టుకున్నారు చంద్రమోహన్. ఆయన మరణం ఇప్పటికీ చాలా మంది జీర్ణించుకోలేకపోతున్నారు. ఆయన కెరీర్‌లో పదహారేళ్ళ వయసు సినిమా ఒక మైలురాయి. కమల్ హాసన్ తమిళంలో చేసిన అద్భుతమైన పాత్రను తెలుగులో చేసి, అద్భుతంగా మెప్పించారు. ఈ చిత్రం తర్వాత ఆయన ప్రస్థానం నిరాఘాటంగా కొనసాగింది. శంకరాభరణం, నేను మా ఆవిడ ఇల్లంతా సందడి వంటి చిత్రాలతో పాటు జంధ్యాల, రేలంగి నరసింహారావు దర్శకత్వంలో అనేక సినిమాల్లో నటించారు. చంద్రమోహన్ కి ఒక అరుదైన లక్కీ హీరో సెంటిమెంట్ ఉంది. ఆయనతో కలిసి నటించిన వాణిశ్రీ , జయప్రద , శ్రీదేవి, భానుప్రియ, తాళ్ళూరి రామేశ్వరి వంటి నటీమణులు ఆ తర్వాత అగ్రతారలుగా ఎదిగారు. ఈ విషయాన్ని చంద్రమోహన్ గారే పలు ఇంటర్వ్యూలలో ప్రస్తావించారు. సుమారు 35–40 మంది హీరోయిన్స్ ఆయనతో నటించిన తర్వాత సూపర్ స్టార్స్ అయ్యారని పరిశ్రమలో ఒక నమ్మకం ప్రచారంలో ఉండేది.హీరో పాత్రల నుండి క్యారెక్టర్ ఆర్టిస్టుగా మారడంలో చంద్రమోహన్ చూపిన తెగువ, వృత్తిపట్ల ఆయనకున్న అంకితభావం అపారమైనది. యువ హీరోలైన ఉదయ్ కిరణ్ , అల్లు అర్జున్, గోపీచంద్ వంటి వారికి తండ్రి పాత్రల్లో నటించి మెప్పించారు. నటి సుధాతో కలిసి అనేక చిత్రాలలో తల్లిదండ్రుల పాత్రలు పోషించి ప్రేక్షకుల మన్ననలు పొందారు. పాత్ర చిన్నదైనా, పెద్దదైనా స్వీకరించి, సమర్థవంతంగా నటించగల నేర్పరి ఆయన. ఈ క్రమంలో ఆయన దాదాపు 900కు పైగా చిత్రాల్లో నటించారు. వ్యక్తిగత జీవితంలో ప్రముఖ రచయిత్రి జలంధరను వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు, మాధవి, మీనాక్షి. ఒకరు సైకాలజిస్ట్‌గా, మరొకరు వైద్యురాలిగా స్థిరపడ్డారు.రియల్ ఎస్టేట్ విషయంలో ఆయనకు చేదు అనుభవాలు ఎదురయ్యాయి. మద్రాసులో ఆరు ఎకరాలతో పాటు పలు స్థలాలను కొనుగోలు చేసినప్పటికీ, కబ్జాలు, ఇతర వివాదాల కారణంగా వాటిని అమ్మేయాల్సి వచ్చింది. వాటిని చూసుకోవడానికి ఎవరూ లేకపోవడం, సినిమాలతో బిజీగా ఉండటం వల్ల ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ఆయన చెప్పారు. ఈ రోజు లెక్కల ప్రకారం చూస్తే రూ. 100 కోట్లకు పైగా ఆస్తులను కోల్పోయినట్టే అని ఆయన గతంలో ఆవేదన వ్యక్తం చేశారు. చివరి రోజుల్లో చంద్రమోహన్ అనారోగ్యంతో బాధపడ్డారు. ఆహారపు అలవాట్లు, నిర్లక్ష్యం వల్ల ఊపిరితిత్తులు, కిడ్నీలు, కాలేయం దెబ్బతిన్నాయి. కొంతకాలం చికిత్స తీసుకున్నప్పటికీ ప్రయోజనం లేకపోయింది. 2023లో హైదరాబాద్‌లో కన్నుమూసిన చంద్రమోహన్ మరణం తెలుగు సినిమా పరిశ్రమకు తీరని లోటు.

## ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి నివాసంలో ఏసీబీ దాడులు

**టిమీడియా, జూన్23, వినాయక్ నగర్ :**



నిజామాబాద్ జిల్లాలో అవినీతి విరోధక శాఖ అధికారుల బృందాల దాడులు కలకలం సృష్టించాయి. నిజామాబాద్ జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ కె. మల్లారెడ్డి ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నట్లు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు వచ్చినట్టు తెలిసింది. దీంతో మంగళవారం ఉదయం నుండి ఏసీబీ డిఎస్పి శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఉదయం నుండి దాడులు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్ ప్రాంతంలో గల ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయం తో పాటు నగరంలోని ప్రగతి నగర్ లో ఈఎస్ నివాసముండే ఆయన ఇంటిపై ఏకధాటిగా దాడులు నిర్వహించారు.ఈ దాడుల్లో ఈఎస్ కార్యాలయంలోని కొన్ని డాక్యుమెంట్లను ఏసీబీ బృందం స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. దీంతోపాటు ఈఎస్ ఇంట్లో నుంచి పలు రికార్డులతో పాటు ఇతర విలువైన వస్తువులను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అనంతరం ఈఎస్ మల్లారెడ్డిని ఏసీబీ అధికారులు తమ వెంట తీసుకువెళ్లి విచారణ నిర్వహిస్తున్నారు. అలాగే హైదరాబాద్ నగరంలో ఉన్న ఈఎస్ ఇంటిపై సైతం ఏసీబీ అధికారుల బృందం దాడి చేసి అక్కడ తనిఖీలు నిర్వహిస్తున్నారు.

## సుగూరులో విత్తన మేలా

**టీ మీడియా, జూన్ 23 పెబ్బేరు:**



వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం సూగుర్ గ్రామంలో రైతులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రైతులకు నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయాలని విత్తనమేలా కార్యక్రమాన్ని పెట్టడం జరిగింది ఈ కార్యక్రమంలో భాగంగా సూగూర్ రైతులకు వరి విత్తనాలు సరఫరా చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో పెబ్బేరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ నరసింహ నాయుడు వ్యవసాయ విస్తరణ అధికారి అంజనేయులు గుణమోని పరశురాముడు సేవకుల నందీశ్వర్ వార్డ్ మెంబర్ అప్పరాల మన్యం గుణమోని స్వామి గుణమోని చింతలయ్య ఉప్పరి రాఘవేందర్ చాకలి బాబు గుట్ట గాళ్ళ అంజి గొల్ల ఈశ్వరమ్మ తదితరులు పాల్గొనడం జరిగింది.



## కోచింగ్ సెంటర్ కూల్చివేతకు నోటీసులు

**టిమీడియా, జూన్23, లక్నో:**

ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో ఓ కోచింగ్ సెంటర్‌లో అగ్నిప్రమాదం జరిగిన ఘటనలో 15 మంది సజీవదహనమైన విషయం తెలిసిందే. నగరంలోని అలీగంజ్ ఏరియాలో ఉన్న ఆ మూడు అంతస్తుల భవనాన్ని కూల్చివేసేందుకు లక్నో డెవలప్మెంట్ అథారిటీ కూల్చివేత ఆదేశాలుజారీ చేసింది. రెసిడెన్షియల్ బిల్డింగ్ పేరుతో ఉన్న ఆ భవనంలో కమర్షియల్ స్పేస్‌ను ఎలా నిర్మించాలని అధికారులు ఆరా తీస్తున్నారు. లక్నో మున్సిపల్ అధికారులపైన కూడా చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులు సిద్మయ్యారు. వాస్తవానికి ఆ బిల్డింగ్‌ను కూల్చివేయాలని 2016లో ఆదేశాలు జారీ చేశారు. అనుమతి లేని నిర్మాణంగా భావిస్తూ ఆ ఆదేశాలు ఇచ్చారు. కానీ రెండు నెలల్లోనే మళ్లీ ఆ ఆదేశాలను వెనక్కి తీసుకున్నారు.అలీగంజ్ బిల్డింగ్ కూల్చివేతకు ఆదేశాలు ఇచ్చినట్లు ఎల్‌డీఏ వైస్ చైర్మెన్ ప్రథమేశ్ కుమార్ తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం పట్ల దర్యాప్తు చేపట్టామని, త్వరలో చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ఆ బిల్డింగ్‌లో ఉన్న యానిమేషన్ సెంటర్‌లో కోర్సులు నేర్చుకునేందుకు భారీ సంఖ్యలో విద్యార్థులు వస్తుంటారు. అగ్నిప్రమాద ఘటనపై దర్యాప్తు చేపట్టేందుకు ప్రభుత్వ ఏర్పాటు చేసిన సిట్ బృందం ఇవాళ ఉదయం ఆ ప్రదేశానికి చేరుకున్నది.సీఎం యోగి ఆదేశాల మేరకు సిట్ బృందం దర్యాప్తు చేపడుతోంది. ఫోరెన్సిక్ ల్యాబ్‌కు చెందిన ఆరు మంది సిబ్బంది ఇవాళ ఆ బిల్డింగ్ వద్ద ఆధారాలు సేకరించారు. అగ్నిప్రమాదం దేని వల్ల జరిగిందో, బాధ్యులు ఎవరో తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

## టెలిగ్రామ్ యాప్‌ను రిస్టోర్ చేసిన గూగుల్

● మళ్లీ ప్రారంభమైన సేవలు

**టిమీడియా, జూన్23,న్యూఢిల్లీ:**




టెలిగ్రామ్ యాప్ మళ్లీ ప్రారంభమైంది. ఆ యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్‌లో మళ్లీ రిస్టోర్ చేశారు. నీట్ యూజీ రీఎగ్జామ్ నేపథ్యంలో ఇటీవల కేంద్ర ప్రభుత్వం టెలిగ్రామ్ యాప్‌ను బ్యాన్ చేసిన విషయం తెలిసిందే. జూన్ 21వ తేదీన నీట్ పరీక్ష జరిగింది. అయితే జూన్ 22వ తేదీన వరకు ఆ యాప్‌ను బ్లాక్ చేశారు. ఇవాళ ఉదయం నుంచి కొందరు యూజర్లకు టెలిగ్రామ్ యాప్ అందుబాటులోకి వచ్చేసింది. గూగుల్ రిస్టోర్ చేయకముందే కొందరు దాన్ని వాడడం ప్రారంభించారు. కానీ యాపిల్ ఆప్ స్టోర్‌లో మాత్రం ఇంకా డీలిస్టు కేటగిరీలోనే ఆ యాప్ ఉన్నట్లు తెలుస్తోంది. యాపిల్ సంస్థ దీనిపై స్పందించేందుకు నిరాకరించింది. టెలిగ్రామ్ యాప్ బ్యాన్ అంశంపై తాత్కాలిక నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం చెప్పింది. నీట్‌కు చెందిన ఫేక్ పేపర్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కారణంగా.. ముఖ్యంగా టెలిగ్రామ్ యాప్‌ను బ్యాన్ చేస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొన్న విషయం తెలిసిందే.

జూన్ 3వ తేదీన టెలిగ్రామ్ ప్రతినిధులతో భేటీ నిర్వహించిన తర్వాత బ్యాన్ ప్రకటన చేశారు. టెలిగ్రామ్ యాప్‌తో పాటు అనుబంధ వెబ్ లింకులను కూడా బ్లాక్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వెబ్ వర్షన్‌ను కూడా ఆపేశారు. జూన్ 30వ తేదీ వరకు టెలిగ్రామ్ మెసేజ్ ఎడిటింగ్ ఆప్షన్‌ను కూడా బ్లాక్ చేసిన విషయం తెలిసిందే.

